

అందరివాడు.. రామ్మోహన్‌నాయుడు



ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు

- పార్టీలకు అతీతంగా ప్రజాభిమానం
- ఈసారి 36,754 క్రాస్‌ఓట్లు లభ్యం

(మెళియాపుట్టి)

రాజకీయాలకు అతీతంగా ప్రజాసమస్యలపై పార్లమెంట్‌లో ప్రస్తావించి.. వాటికి పరిష్కారం మార్గం చూపుతూ.. తండ్రికి తగ్గ తనయుడిగా ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రత్యేక గుర్తింపు పొందారు. అందుకే ఓటర్లు కూడా పార్టీలకు అతీతంగా ప్రతి ఎన్నికల్లోనూ ఆయనపై అభిమానం చూపుతూ.. వరుసగా మూడు సార్లు గెలిపించారు. వైసీపీ ఓటర్లు సైతం క్రాస్‌ఓట్లతో ఆయనపై అభిమానం చూపడంతో మరింత మెజార్టీకి దోహద పడుతున్నారు.

● దివంగత నేత ఎర్రన్నాయుడు ఆకస్మిక మరణం తర్వాత.. రామ్మోహన్‌నాయుడు రాజకీయ ఆరంగేట్రం చేశారు. తొలిసారిగా 2014 ఎన్నికల్లో శ్రీకాకుళం టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి.. వైసీపీ అభ్యర్థి రెడ్డి శాంతి పై విజయం సాధించారు. అప్పట్లో రామ్మోహన్ నాయుడుకు 5,56,545 ఓట్లు రాగా.. రెడ్డి శాంతికి 4,28,853 ఓట్లు వచ్చాయి. రామ్మోహన్‌నాయుడుకు 1,27,692 ఓట్ల మెజార్టీతో లభించింది.

● 2019 ఎన్నికల్లో మరోసారి ఎంపీ రామ్మోహన్‌నాయుడు గెలుపొందారు. ఆ ఎన్నికల్లో రామ్మోహన్‌నాయుడుకు 5,34,544 ఓట్లు రాగా.. వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌కు 5,27,891 ఓట్లు పడ్డాయి. రామ్మోహన్‌నాయుడు 6,653 మెజార్టీ లభించింది. గత ఎన్నికల్లో వైసీపీ ఒక్కచాన్స్ హవా నడిచింది. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో టెక్కలి, ఇచ్ఛాపురం మినహా.. మిగిలిన ఎనిమిది చోట్ల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలిచారు. ఆ హవాలోనూ.. క్రాస్ ఓటింగ్ ద్వారా టీడీపీ ఎంపీ అభ్యర్థిగా రామ్మోహన్‌నాయుడుకు 6,653ఓట్ల మెజార్టీ సాధించడం.. ప్రజల్లో ఆయనపై ఉన్న అభిమానాన్ని మరోసారి చాటిచెప్పింది.

● ఈ సారి ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన రామ్మోహన్‌నాయుడు 3,14,107 ఓట్ల మెజార్టీతో హ్యాట్రిక్ విజయం దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు 7,34,501 ఓట్లు రాగా.. వైసీపీ అభ్యర్థి పేరాడ తిలక్‌కు 4,20,394 ఓట్లు పడ్డాయి. ఈసారి కూడా ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు 36,754 క్రాస్ ఓట్లు పడడం.. అనూహ్య మెజార్టీ రావడంతో ప్రజల్లో ఆయనపై తరగని అభిమానాన్ని నిరూపించింది.

చంద్రబాబుకు.. అచ్చెన్న శుభాకాంక్షలు



సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు గురువారం ఉండవల్లిలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడ్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణను కూడా కలిసి అభినందించారు. ఎన్డీయే కూటమి అఖండ విజయం సాధించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజాగళం ద్వారా ప్రజలకు మరింత చేరువైన లోకేశ్‌బాబు పార్టీ విజయంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. కాగా.. జిల్లాలో అన్ని స్థానాలు గెలవడం, టెక్కలిలో అత్యధిక మెజార్టీ సాధించడంపై అచ్చెన్నను కూడా చంద్రబాబునాయుడు అభినందించారు. - టెక్కలి

'కోడ్' ముగిసింది

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల కోడ్ గురువారం సాయంత్రం నుంచి ముగిసింది. ఇకపై ఎటువంటి ఆంక్షలు లేవు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ జారీచేశారు. ఏప్రిల్ 25 వరకు నామినేషన్లను స్వీకరించారు. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 83 మంది, శ్రీకాకుళం లోక్‌సభ స్థానానికిగాను 13 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మే 13న పోలింగ్ జరగ్గా.. ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. ఎన్డీయే కూటమి సునామీ మాదిరి వైసీపీని తుడిచిపెట్టేసింది. జిల్లాలో శ్రీకాకుళం లోక్‌సభతోపాటు ఎనిమిది అసెంబ్లీ స్థానాలనూ ఎన్డీయే కూటమి కైవసం చేసుకుంది. కాగా.. కోడ్ నేపథ్యంలో అధికారులు కఠిన ఆంక్షలు అమలు చేస్తూ.. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశారు. గురువారం సాయంత్రంతో 'కోడ్' ఎత్తివేస్తున్నట్లు ఎన్నికల కమిషన్ నుంచి కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు ఎన్నికల కోడ్ ముగిసిందని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ వెల్లడించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

సమష్టి కృషితోనే విజయవంతం

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, జూన్ 6: 'ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ముగిసే వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో, సమష్టిగా కృషి చేశారు' అని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ కొనియాడారు. విజయవంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆర్వోలు, నోడల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా.. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో కీలకపాత్ర పోషించిన జేసీ, డీఆర్వోను ప్రత్యేకంగా అభినందించారు. శాంతిభద్రతల విషయంలో ఎస్పీ రాధిక చర్యలను కొనియాడారు. జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు అంకితభావంతో విధులు నిర్వర్తించారని, విజయానికి అదే మూల కారణమని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు వారి వారి అనుభవాలను పంచుకున్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండి కలెక్టర్ వ్యవహరించిన తీరు, విజయంలో తమను భాగస్వాములను చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, డీఆర్వో ఎం.గణపతిరావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, రిటర్నింగ్ అధికారులు సుదర్శనదొర, భరత్‌నాయక్, అప్పారావు, సీహెచ్ రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహనరావు, నోడల్ అధికారులు వేంకటేశ్వరరావు, ఓబులేసు, బి.మీనాక్షి, సూర్యకిరణ్, చిట్టిరాజు, రాణీమోహన్, శాంతిశ్రీ, కె.చెన్నకేశవరావు, గణపతి రావు, కృష్ణమూర్తి, వెంకటరామన్, సుధ పాల్గొన్నారు.

ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి..



- వలస కూలీల మృత్యువాత
- అనాథలవుతున్న కుటుంబాలు
- పట్టించుకోని కంపెనీలు
- పరిహారం కూడా అందని వైనం
- స్వగ్రామానికి మృతదేహాలను తెప్పించేందుకు అవస్థలు

● 2006లో వజ్రపుకొత్తూరు మండలం అమలపాడుకు చెందిన నౌపాడ వెంకటేష్, పెద్దముహరిపురానికి చెందిన బత్తిని శ్రీరాములు, చినరామక్రిష్ణాపురానికి చెందిన సంగారు మోహనరావు.. దుబాయిలో రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. ఈ ముగ్గురూ ఉపాధి కోసం దుబాయి వెళ్లి.. ఊహించని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి కుటుంబ సభ్యులకు విషాదాన్ని మిగిల్చారు. బాధిత కుటుంబాల తరపున అప్పటి ఎంపీ కింజరాపు ఎర్రన్నాయుడు కేంద్ర హోంశాఖ, విదేశాంగ శాఖతో మాట్లాడి వారి మృతదేహాలను వారం రోజుల్లో స్వదేశానికి తెప్పించారు. కంపెనీ నుంచి కొంత పరిహారం అందించగలిగారు.

● 2022లో చింతవానిపేటకు చెందిన యలమంచి లోకనాథం కూడా ఉపాధి కోసం దుబాయి వెళ్లి.. అక్కడ అనారోగ్యంతో చనిపోయాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు నెలరోజులు పట్టింది. అలాగే ఉద్దాన గోపినాథం పురానికి చెందిన ఒక వ్యక్తి కొన్నాళ్ల కిందట ఖతర్‌లో చనిపోగా.. ఆయన మృతదేహం 27 రోజులకు స్వగ్రామానికి చేరింది.




● తాజాగా వజ్రపుకొత్తూరు మండలం చినవంక గ్రామానికి చెందిన **శంకర్ అలియాస్ సతీష్ (32)** ఈ నెల 5న సౌదీ అరేబియాలో అనారోగ్యంతో మృతి చెందాడు. మూడేళ్ల కిందట ఉపాధి కోసం శంకర్ ఖతర్ దేశం వెళ్లాడు. తల్లి కాంతమ్మ ఆరోగ్యం బాగోలేకపోవడంతో స్వగ్రామానికి వచ్చేశాడు. అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటున్నాడు. అప్పు చేసి తల్లికి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. అనారోగ్యంతో ఆమె మృతి చెందింది. అప్పుల భారం పెరగడంతో నాలుగు నెలల కిందట ఉపాధి కోసం సౌదిఅరేబియా వెళ్లాడు. డబ్బులు సంపాదించి అప్పు తీర్చేసి.. ఆ తరువాత పెళ్లి చేసుకోవాలని భావించాడు. కాగా.. బుధవారం తెల్లవారుజామున సౌదీఅరేబియాలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. దీంతో వారు బోరున విలపించారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు.

(వజ్రపుకొత్తూరు)

సిక్కోలు.. వలసల జిల్లాగా పేరొందింది. స్థానికంగా ఉపాధి అవకాశాలు చాలా మంది హైదరాబాద్, ఒడిశా, బీహార్, పశ్చిమబెంగాల్‌తోపాటు విదేశాలకు సైతం తరలిపోతున్నారు. కాగా.. ఉపాధి కోసం విదేశాలకు వెళ్తున్న వలస కూలీలు.. అక్కడ అనారోగ్యానికి గురి కావడం.. లేదా వివిధ ప్రమాదాల బారిన పడి కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. కుటుంబ సభ్యులకు తీరని విషాదాన్ని మిగుల్చుతున్నారు. కొందరికి చివరిచూపు కూడా దక్కని పరిస్థితి. వారి మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకువచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. విదేశాల్లో వలస కూలీలు మృతి చెందితే.. బాధిత కుటుంబాలకు నిర్ణీత పరిహారం కూడా అందకపోవడంతో.. చాలామంది రోడ్డున పడుతున్నారు. కుటుంబాన్ని పోషించేవారు లేక అనాథలవుతున్నారు.

● ఉపాధి మార్గంతోపాటు.. అప్పుల భారం నుంచి బయటపడేందుకు చాలా మంది విదేశాల్లో ఉద్యోగాల కోసం ఏజెంట్లకు సొమ్ములు చెల్లిస్తున్నారు. ఏజెంట్లు చెప్పినదానికి అక్కడి పరిస్థితి విరుద్ధంగా ఉంటాయని పలువురు వలస కూలీలు పేర్కొంటున్నారు. అక్కడ ఇబ్బందులు పడలేక.. తిరిగి స్వగ్రామానికి చేరుకునేందుకు అనుమతులు దొరక్క.. నరకయాతన పడిన సందర్భాలెన్నో అని చెబుతున్నారు. ఈ క్రమంలో అనేకమంది మానసిక వ్యథతో అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతుంటారని పేర్కొంటున్నారు. మృతదేహాల కోసం కూడా కుటుంబ సభ్యులు ఒక్కోసారి నెలరోజుల వరకూ ఎదురుచూడాల్సిన సందర్భాలు ఉన్నాయి. ఆయా దేశాల్లో నిబంధనలను అనుసరించి.. మృతదేహాలను స్వగ్రామాలకు పంపుతుండడంతో అవి ఎప్పుడు వస్తాయో తెలియని దుస్థితి. పని చేయించుకున్న కంపెనీలు సక్రమంగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మృతుడి కుటుంబానికి అంతంతమాత్రమే పరిహారాన్ని అందజేసి చేతులు దులుపుకొంటాయనే విమర్శలున్నాయి. విదేశాంగ విధానంలో రక్షణ చట్టాలు బలంగా లేకపోవడంతో బాధిత కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లినవారికి గ్రూప్ ఇన్స్యూరెన్స్ వంటి సదుపాయాలు కచ్చితంగా అమలు చేస్తే.. మృతుల కుటుంబాలకు కొంతమేర భరోసా దక్కే అవకాశం ఉంది. ఈ దిశగా చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



రక్షణ చట్టాలు రావాలి



ఉపాధి కోసం విదేశాలకు వెళ్తున్న వారి బాధలు వర్ణణాతీతం. వారు అనారోగ్యం పాలైనా.. మృతి చెందినా.. స్వగ్రామంలో బాధిత కుటుంబాలు అల్లాడుతుంటాయి. మృతదేహం కోసం రోజల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. విదేశాంగ చట్టాలు కఠినతరంగా ఉంటేనే బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుంది.

-వై.భాస్కరరావు, వజ్రపుకొత్తూరు

పరిహారం అందించాలి



ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులకు కంపెనీల నుంచి పరిహారం తక్షణమే అందజేయాలి. కొన్ని కంపెనీలు మృతులకు పరిహారం అందించే విషయంలో స్పందించడం లేదు. అనేక మెళికలు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎంపీ రామ్మోహన్నాయుడు సహాయంతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చిన సందర్భాలు ఉన్నాయి.

-పుచ్చ ఈశ్వరరావు, పూండి గోవిందపురం


మద్యంమత్తులో.. కడతేర్చాడు

- దాబాలో ఇద్దరి మధ్య ఘర్షణ
- రాయితో దాడిలో ఒకరి మృతి

సోంపేట, జూన్ 6: ఓ దాబాలో పని చేస్తున్న ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో మద్యంమత్తులో రాయితో దాడి చేయగా.. ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనకు సంబంధించి బారువ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోంపేట మండలం కొర్లాం జాతీయ రహదారి సమీపంలోని సంగీత దాబాలో పనిచేస్తున్న మాడుగుల రాంబాబు హత్యకు గురయ్యాడు. రాంబాబుకు దాబాలో పనిచేస్తున్న మరో వ్యక్తి సూర్యనారాయణ మహంతి వ్యక్తిగత కారణాలతో తరచూ గొడవ పడుతుండేవారు. బుధవారం రాత్రి పడుకునే సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం తలెత్తింది. ఇద్దరూ మద్యంమత్తులో ఘర్షణకు దిగారు. ఈక్రమంలో సూర్యనారాయణ మహంతి.. రాంబాబు తలపై రాయితో బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు రాంబాబుది పోలాకి మండలం చల్లాయివలస. సూర్యనారాయణ మహంతిది ఇచ్ఛాపురం మండలం కొళిగాం. రాంబాబు మృతిపై దాబా యజమాని గణపతి బారువ పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనపై బారువ ఎస్ఐ చంద్రశేఖర్, సోంపేట సీఐ మల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.



రాంబాబు మృతదేహం



వంశధార కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- అధ్వానంగా వంశధార కాలువలు
- కానరాని మరమ్మతులు
- రైతులకు తప్పని సాగునీటి ఇబ్బందులు

(పోలాకి)

వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టు పడకేశాయి. కనీసం వంశధార కాలువల నిర్వహణ, మరమ్మతులకు కూడా నిధులు మంజూరుకాలేదు. దీంతో రైతులు సాగునీటి కోసం అగచాట్లు పడుతున్నారు. మరోవైపు కాలువల్లో గుర్రపు డెక్క పేరుకుపోవడం.. షట్టర్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలాకి మండలంలోని ఆయకట్టుకు దేశవానిపేట వద్ద 11ఆర్ కాలువ, పోలాకి 16టి, ఎల్11, ఎల్12 కాలువలు సాగునీరందిస్తాయి. వంశధార ఎడమ కాలువ పరిధిలో మెయిన్ చానల్ దూగాం నుంచి నరసన్నపేట మార్గంలో కాలువలు శిథిలావస్థకు చేరాయి. షట్టర్లు పూర్తిగా పాడయ్యాయి. గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ఖరీఫ్‌లో సైతం నీరందడంలేదని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా సుసరాం తంపర వద్ద వంశధార కాలువలు ఆధునీకరించకపోవడంతో ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో ఏటా వర్షాకాలంలో పంట ముంపునకు గురవుతోందని తంపర రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలువల్లో పిచ్చిమొక్కలు

పోలాకి మండలంలోని సుమారు 30వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు సిద్ధం చేస్తున్నారు. వంశధార కాలువల్లో నీరుపారే అవకాశం లేకపోవడంతో వర్షాలపైనే ఆధారపడుతున్నారు. మబగాం, పోలాకి, రాళ్లపాడు, ఈదులవలస, చల్లబంద, సంతలక్ష్మీపురం, డోల, గొల్లలవలస, దీర్ఘాశి, వనితమండలం తదితర గ్రామాల పరిధిలోని వంశధార కాలువలు పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ఉపాధిహామీ పథకం కింద మొక్కుబడిగా పనులు చేయించి అధికారులు చేతులు దులుపుకొన్నారని రైతులు పాగోటి అప్పారావు, రామారావు, నాగిరెడ్డి, మెండ శ్రీనివాసరావు, పల్లిసూరిబాబు, పల్లిపాపయ్య, పల్లిరమణయ్య, అప్పన్న, దాసరి ఎర్రన్న, శిమ్మరామారావు, దాస్ ఆరోపించారు. గతంలో వైసీపీ పాలకులు పట్టించుకోలేని విమర్శించారు. వంశధార కార్యాలయ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా డోల గ్రామానికి చెందిన తిరుమలరావు వ్యవహరిసున్నా.. కాలువలు ఆధునికీకరణకు నోచుకోవడం లేదని వాపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా.. సాగునీటి కష్టాలు తీర్చేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఈదులవలస వద్ద శిథిలావస్థకు చేరిన వంశధార కాలువ షట్టర్

ప్రతిపాదనలే తప్ప... పనులు లేవు

ఎనిమిదేళ్లుగా వంశధార కాలువలు ఆధునీకరించిన దాఖలాలు లేవు. ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారు తప్ప ఆచరణ లేదు. ఉపాధిహామీ పనులతో కాలువలు మరమ్మతులు కావు. నిధులు మంజూరు చేసి షట్టర్లు, వంతెనలు, ఆధునికీకరించాలి.

- పాగోటి అప్పారావు, మెండ శ్రీనివాసరావు, రైతులు, పోలాకి మండలం

నిధులు ఇవ్వాలి

ఏటా ఖరీఫ్‌లో సాగునీటి కోసం కిల్లాం వద్ద చానల్‌కు రైతులంతా వెళ్లి పోరాడుతున్నాం. అంపలాం, ఈదులవలస, ఉరజాం, సుసరాం, దీర్ఘాశి, డోల గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన వంశధార కాలువ షట్టర్లు పాడయ్యాయి. వీటి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి.

- దాసరి ఎర్రన్న, దీర్ఘాశి, పోలాకి మండలం

చిత్తశుద్ధితో వ్యవహరించాలి

సుసరాం, సత్రవుపేట, బెలమర, పాలవలస, దండులక్ష్మీపురం, చెల్లాయివలస, అంబీరుపేట, డోల గ్రామాల పరిధిలోని వంశధార కాలువలు రూపురేఖలు లేవు. సుసరాంలో సుమారు రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో తంపర ముంపు భూములు ఉన్నాయి. వర్షం కురిస్తే పంట ముంపునకు గురవుతోంది. వంశధార కాలువల ద్వారా సాగునీరు సరఫరా విషయం మరచిపోయారు. ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలి.

- తమ్మినాన భూషణరావు, మాజీ ఎంపీపీ, సుసరాం

సాహస అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట, జూన్ 6: సాహస అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు తెలిపారు. 'గతేడాదికి సంబంధించి సాహస కృత్యాల్లో విశేష ప్రతిభ చూపిన వారి నుంచి భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ద్వారా టెన్జింగ్ నార్వే జాతీయ సాహస అవార్డునకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. 2021, 2022, 2023 సంవత్సరాల్లో భూమి నీరు, గాలిలో చేసిన సాహస కార్యక్రమాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు ఈ నెల 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏటా ఈ అవార్డును రాష్ట్రపతి చేతుల మీదుగా బహుకరిస్తారు. అవార్డు గ్రహీతకు టెన్జింగ్ నార్వే కాంస్య విగ్రహంతోపాటు ప్రశంస పత్రం, బ్లేజర్, రూ.15 లక్షల నగదు అందజేస్తారు' అని సెట్‌శ్రీ సీఈవో వివరించారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, జూన్ 6: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల ఐదో సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. బీఏ, బీబీఏ, బీసీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులకు సంబంధించి 10,822 మంది విద్యార్థులు హాజరుకాగా, ఇందులో 5,316 మంది ఉత్తీర్ణులై 49.12 శాతం ఫలితాలు సాధించారు. ఫలితాల వివరాలను జ్ఞానభూమి పోర్టల్‌లో పొందుపర్చినట్టు పరీక్షల విభాగం డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఫలితాలపై విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నిర్ధేశించిన ఫీజు చెల్లించి 15 రోజుల్లో పునఃమూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల, జూన్ 6: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న పాలిసెట్ కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. గత నెల 27న కౌన్సెలింగ్ ప్రారంభమైంది. జిల్లాకు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(శ్రీకాకుళం)లోని హెల్ప్‌లైన్ కేంద్రంలో సర్టిఫికెట్లను పరిశీలించారు. మొత్తం 2,307మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన విద్యార్థులు ఈ నెల 7నుంచి 10వ తేదీలోగా కళాశాలలు, కోర్సుల ఎంపిక కోసం వెబ్‌ఆప్షన్లు నమోదుచేసుకోవాలి. 11న ఆప్షన్ల నమోదులో మార్పులు, చేర్పులు చేసుకునే వీలుంది. 13న సీట్ల కేటాయింపు వివరాలను సెట్ కన్వీనర్ ప్రకటిస్తారు. సీటు పొందిన విద్యార్థులు 14 నుంచి 19వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి. ఈ నెల 14 నుంచి తరగతులను ప్రారంభిస్తారు. పాలిసెట్‌లో ర్యాంకు పొంది సర్టిఫికేట్లు పరిశీలనకు హాజరుకాని విద్యార్థులు ఈ నెల 11వ తేదీలోగా హెల్ప్‌లైన్ కేంద్రాన్ని సంప్రదించాలని సమన్వయకర్త జి.దామోదరరావు, సహాయ సమన్వయకర్త డి.మురళీకృష్ణ తెలిపారు.







ఆ విశ్వాసం పవన్ కళ్లలో కనిపించింది

పరుచూరి గోపాలకృష్ణ



ఆంధ్రప్రదేశ్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో అసాధారణ విజయం సొంతం చేసుకున్న కూటమికి చిత్ర పరిశ్రమ నుంచి శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. ఈ సందర్భంగా రచయిత పరుచూరి గోపాలకృష్ణ చంద్రబాబుకి, పవన్‌కల్యాణ్‌కు అభినంద నలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పవన్‌కల్యాణ్‌ను ప్రశంసిస్తూ 'పవన్‌కు బిడియం ఎక్కువ. కానీ ఈ ఎన్నికల కోసం ఎంతో ఆత్మవిశ్వాసంతో పని చేశారు. 'నేను సాధిస్తున్నా' అనే విశ్వాసం ఆయన కళ్లల్లో కనిపించింది. పవన్‌కల్యాణ్ అభిమానులు ఎంత ఎమోషనల్‌గా ఉంటారో నాకు తెలుసు. కూటమి ఏర్పాటులో పవన్‌కల్యాణ్ కీలక పాత్ర పోషించి, ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన తర్వాత కూడా ఆయన ఎంతో విన యంగా ఎవరినీ నిందించకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలా అనే ఆలో చనతోనే మాట్లాడారు. అది పవన్ గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనం' అన్నారు.

అందరినీ ఆకట్టుకుంటుంది



'గూఢచారి', 'మేజర్' చిత్రాలతో దర్శకుడిగా టాలీవుడ్‌లో తనదైన ముద్రవేశారు శశి కిరణ్‌తిక్క. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన 'సత్యభామ' సినిమాకు ఆయన స్ర్కీన్‌ప్లే అందించడమే కాకుండా సమర్పకులుగా వ్యవహరించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా శశి కిరణ్‌తిక్క మీడియాతో ముచ్చటించారు "ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. థియేటర్స్‌లో సినిమాను చూసేటప్పుడు ఇందులోని ఎమోషన్స్‌తో ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతారు. దర్శకుడు సుమన్ సినిమాను గ్రిప్పింగ్‌గా తీసిన విధానం, కాజల్ ఎనర్జిటిక్ యాక్టింగ్, శ్రీ చరణ్ సంగీతం ఈ సినిమాకు పెద్ద హైలైట్స్" అని చెప్పారు.

క్లీన్ చిట్ వచ్చే వరకూ..



బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్ట్ అయిన నటి హేమను మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) గురువారం సస్పెండ్ చేసింది. డ్రగ్స్ కేసుపై వివరణ ఇవ్వాలని హేమకు నోటీసు పంపించినా ఆమె స్పందించకపోవడంతో 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో హేమకు క్లీన్ చిట్ వచ్చేవరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని 'మా' కార్యవర్గం తెలిపింది.

బ్లాక్‌బస్టర్ గ్యారంటీ



శర్వానంద్, కృతి శెట్టి హీరోహీరోయన్లుగా నటించిన చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించగా, టీ.జీ.విశ్వ ప్రసాద్ నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ "ఈ సినిమాలో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ గ్యారంటీ" అని చెప్పారు. "కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ అన్నారు.








పలాస: షిర్డీసాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న గౌతు శిరీష, వెంకన్నచౌదరి దంపతులు


బూర్జ: రవికుమార్‌ను అభినందిస్తున్న నాయకులు


పాతపట్నం:మామిడి గోవిందరావును అభినందిస్తున్న దృశ్యం


నరసన్నపేట: పట్టణంలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


వజ్రపుకొత్తూరు: చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ శ్రేణుల సంబరాలు

- ఆలయాల్లో పూజలు.. విజయోత్సవ ర్యాలీలు
- కూటమి విజయంతో జోష్


ఆమదాలవలస:ఉపాధి పనుల వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు


ఇచ్ఛాపురం: కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లిస్తున్న కార్యకర్తలు

జిల్లాలోని టీడీపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో టీడీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. గురువారం పలుచోట్ల టీడీపీ నాయకులు కేకులుకట్ చేయడంతో పాటు టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. విజయోత్సవ ర్యాలీలు చేపట్టారు.

● **నరసన్నపేట:** ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయననిఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి తెలిపారు. నరసన్నపేటలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తొలుత పైడితల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యవరం రుత్వీకులు ఆశీర్వదించారు. అనంతరం పట్టణంలో మెయిన్ రోడ్డు మీదుగా ఇందిరానగర్‌లో గల ప్రజా సదన్ వరకు ర్యాలీ చేపట్టారు. అలాగే కార్యకర్తలు, జట్టు కళాసీ యూనియన్ భవనం వద్ద గజమాలతో బగ్గు రమణమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో సారవకోట ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, నాయకులు ధర్మాన తేజ్‌కుమార్, శిమ్మ చంద్రశేఖర్, భైరి భాస్కరరావు, మెండ రాంబాబు, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, బలగ ప్రహర్ష, బోయన సతీష్, తాళాభక్తుల సతీష్, రోణంకి కృష్ణంనాయుడు, లుకలాపు రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

● **జలుమూరు (సారవకోట):** నరసన్నపేట ఎమ్మెల్యేగా బగ్గురమణమూర్తి విజయం సాధించడంతో టీడీపీ రాష్ట్ర బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజకుమార్ ఆధ్వర్యంలో సవరడ్డపనస టీడీపీ కార్యాలయం నుంచి పోలాకి మండలం మబగాం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జలుమూరు మండలం చల్లవానిపేట కూడలి, నరసన్నపేట, మీదుగా మబగాం వరకు పార్టీ కార్యకర్తల ర్యాలీ చేశారు. మబగాంలో రమణమూర్తికి శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు. ర్యాలీలో టీడీపీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు సురవరపు తిరుపతిరావు, నందకిషోర్, చల్ల ఆనందరావు, సాధు చిన్నికృష్ణంనాయుడు, డి.జయరాం, తాడేల భీమారావు పాల్గొన్నారు.

● **పలాస:** పలాస రైల్వేస్టేషన్‌రోడ్డులోని షిర్డీ సాయిబాబా ధ్యానమందిరంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్నచౌదరి దంపతులు పూజలు చేశారు.ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆమెకు సత్కరించారు. కాగా గౌతు శిరీషకు తన నివాసంలో నియోజకవర్గ నాయకులు గాలి కృష్ణారావు, పీరుకట్ల విఠల్‌రావు, మల్లా శ్రీనివాసరావుతోపాటుపలువురు శుభాకాంక్షలు చెప్పారు.వైశ్యసంక్షేమసంఘం గౌరవాధ్యక్షుడు మల్లా భాస్కరరావు, సభ్యులు తిరుమలరావు, వీఎల్ఎస్‌రాజు శిరీషకు సత్కరించారు.

● **వజ్రపుకొత్తూరు:** పూండి గోవిందపురంలో నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు పుచ్చశోభారాణి ఆధ్వర్యంలో ఎన్డీఏకూటమి గెలుపొందడంతో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యేగా గౌతు శిరీష,ఎంపీగా రామ్మోహన్‌నాయుడు గెలుపొందడంతో టీడీపీ శ్రేణులకు ఉత్సాహం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో కర్నిరమణ, పుచ్చ ఈశ్వర్రావు, కర్ని ఢిల్లేశ్వరి , శంకర్ పాల్గొన్నారు.

● **సంతబొమ్మాళి:** రాష్ట్రంలో కూటమితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలుగా అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు గెలుపొందడంతో మూలపేటలో సంబరాలు చేశారు. 108 లీటర్ల పాలుతో చంద్రబాబునాయుడు, అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలా ధ్యక్షుడు జీరు భీమారావు, నాయకులు కోట నారంనాయుడు, జీరు సుందరరావు పాల్గొన్నారు.

● **నందిగాం:** నరేంద్రపురం, పాలవలస, నారాయణపురం, పాతినవానిపేట, దేవళభద్ర, జల్లపల్లి, కాపుతెంబూరుల్లో టీడీపీ నాయకులు జీరు మోహనరావు, కె.ధర్మారావు, బి.సన్యాసిరావు, ఎస్.ప్రసాదరావు, ఎ.సత్యం, కె.హరిబాబు తదితరుల నేతృత్వంలో వీధుల్లో బాణసంచాలు కాలుస్తూ ఆటపాటలతో సందడిచేశారు.

● **ఆమదాలవలస:** మండలంలోని జొన్నవలసలో ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీలు, టీడీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు.ఈ సందరంగా ఉపాధి కూలీలు టీడీపీ టోపీలు, కండువాలు ధరించి రవికుమార్ చిత్రపటాన్ని చెరువు పని మధ్యలో ఉంచి పసుపు రంగు గల కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూఐదేళ్ల వైసీపీ పాలనలో ఉపాధి పనులు నిర్వహణకు అవసరమైన సామగ్రి, వేసవి అలవెన్స్ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

● **బూర్జ:** ఎన్నికల్లో కూటమిది ప్రజా విజయమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శ్రీకాకుళంలోని ఆయన స్వగృహంలో రవికుమార్‌ను బూర్జ మండల నాయకులు జల్లు రామారావు, ఎం.కృష్ణమూర్తి, ఎం.సతీష్, జె.గిరికుమార్ కలిసి అభినందించారు.

● **ఇచ్ఛాపురం:** రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించడంతో మునిసిపాలిటీలోని 11వ వార్డు గౌడవీధికి చెందిన యువకులు ధనేశ్వరిఅమ్మవారికి 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఆశి లీలారాణి, యువకులు గణేష్ గౌడ, నరేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

● **పాతపట్నం:** ఎమ్మెల్యేగా గెలుపొందిన మామిడి గోవిందరావును తామరలో పాతపట్నంలోని ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● **ఎల్.ఎన్.పేట:** సామాన్యవ్యక్తిగా ప్రజల మధ్యకు వచ్చి మొదటిసారే పాతపట్నం ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు గెలవడం ఆనందంగా ఉందని జడ్పీటీసీ మాజీ సభ్యుడు శివ్వాల తేజేశ్వరరావు ఒక ప్రకటన లో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేసి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన గోవిందరావు నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తూ ప్రజల మధ్య ఉండి ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములవుతారన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

● **మెళియాపుట్టి:** మెళియాపుట్టిలో ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు అనపాన రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు సంబరాలు నిర్వహించారు.

● **హిరమండలం:** రాష్ట్రంలో పార్టీ విజయంసాధించడంతో పాటు పాతపట్నం ఎమ్మెల్యేగా మామిడి గోవిందరావు గెలవడంతో హిరమండలంలో ప్రతి దుకాణానికి స్వీట్లు పంచుతూ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాడె కృష్ణ, జి.కామేశ్వరరావు, ఎల్‌వీ రమణ, చింతాడ గిరి, యాత్రా భాస్కరరావు, సాయి, బాలకృష్ణ పాల్గొన్నారు.


సంతబొమ్మాళి: మూలపేటలో సందడిచేస్తున్న శ్రేణులు


సారవకోట సవరడ్డపనస నుంచి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు


హిరమండలం: సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు


నందిగాం: నరేంద్రపురంలో నృత్యాలుచేస్తున్న మహిళలు


మెళియాపుట్టి: స్వీట్లు పంపిణీచేస్తున్న కార్యకర్తలు

10న రాజ్యహింసపై వ్యతిరేక సదస్సు


మాట్లాడుతున్న ప్రజాసంఘాల సభ్యులు

పలాస రూరల్: బొడ్డపాడు అమర వీరుల స్మారకమందిరంలో ఈనెల 10న కమ్యూనిస్టు భావజాలంపై అసత్య ప్రచారాలు, రాజ్యహింసకు వ్యతిరేకంగా జరిగే సదస్సును విజయవంతం చేయాలని ప్రజాసంఘాల సభ్యులు కోరారు. గురువారం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఫాసిస్టు, హిందూమతోన్మాద భావజాల ప్రభావానికి సమాజం గురవు తున్న నేపథ్యంలో తమ వంతు బాధ్యతగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీపీఐఎంఎల్‌లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసి రావు, పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.కుసుమ, ఏపీఎల్‌సీ జిల్లా నాయకులు పత్తిరి దానేసు, ప్రజాసంఘాల నాయకులు డిల్లీరావు, కె.నీలకంఠం, అరుణ, సాలిన వీరాస్వామి పాల్గొన్నారు.

10న పాఠశాలల్లో ఆడిట్

హిరమండలం: హిరమండలం ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 10న మండలంలోని తొమ్మిది పాఠశాలలకు మంజూరైన సివిల్ వర్క్‌ల ఖర్చులపై ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంఈవో రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పిండ్రువాడ, కొండరాగోలు, ధనుపురం, సుభలయ, సవరచొర్లంగి, పెద్దకోరాడనేరేడుగూడ, ఎగువ రుగడ పాఠశాలలకు ఆడిట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సంబంధిత వివరాలు సిద్ధం చేసుకోవాలని కోరారు.

10న భూములు కౌలు వేలంపాట

జలుమూరు: శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయం హక్కు అనుభవంలో ఉన్న సుమారు 30 ఎకరాల భూమి కౌలు వేలంపాట ఈనెల పదో తేదీ ఉదయం 10 గంటలకు ఆలయంలోని గల దేశదాయశాఖ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. మూడేళ్ల కౌలుకోసం టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి గల రైతులు లక్ష రూపాయలు సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో పాటు ప్రథమ ధరావత్తు 30 వేలు రూపాయలు చెల్లించి పాటలో పాల్గొనవచ్చని, హెచ్చుగా పాట పాడిన వారికి కౌలు హక్కు కల్పిస్తామణి తెలిపారు.

11న రాధాగోవిందస్వామి భూములు..

శ్రీముఖలింగంలో గల రాధాగోవిందస్వామి ఆలయం హక్కు అనుభవంలో ఉన్న సుమారు 55 ఎకరాల వ్యవసాయ భూములు కౌలు వేలంపాట ఈనెల 11న ఉదయం 10 గంటలకు రాధాగోవిందస్వామి మఠంలో నిర్వహిస్తున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. వ్యవసాయ భూములు మూడేళ్ల కౌలుకోసం టెండర్ కమ్ బహిరంగ వేలంపాట గ్రామస్థులు సమక్షంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు రూ.లక్ష సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో పాటు 25 వేలు రూపాయలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

పలాస: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులుఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా కళాశాల పనివేళల్లో తమకు సంప్రదించాలని పేర్కొన్నారు.బీఏ, బీకాం,బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు 08945-293642, 869395 39082, 9490638480 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

టెక్కలి: సీతాపురం జడ్పీఉన్నతపాఠశాల విద్యార్థులు పి.జయ ఆదిత్య, లిఖిత్‌కుమార్, జ్ఞానతేజ, నవ్యశ్రీ, గౌతంబాలాజీ, దేవహర్ష ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారని హెచ్ఎం సత్తారు వేణీకుమారి తెలిపారు. వీరికి ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల ఉపకార వేతనం మంజూరవుతుందని పేర్కొన్నారు.


నందిగాం: గ్రంథాలయంలో పత్రికా పఠన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


మెళియాపుట్టి: క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు

జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిబిరాల్లో విద్యార్థులకు గురువారం పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముగింపు పురస్కరించుకుని శుక్రవారం గ్రంథాలయాల నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

● **మెళియాపుట్టి:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ముందుండాలని ఎంఈవో పద్మనాభం తెలిపారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో పాఠశాలకు దూరంగా ఉన్న విద్యార్థులకు గ్రంథాలయలు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. గ్రంథాలయాలకు రావడం వల్ల పరిజ్ఞానం పెంపొందడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అనురాధ, కరుణకర్, గోపి, సంతు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

● **పాతపట్నం:** స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు స్టోరీ రీడింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాధికారి కాళ్ల రాజు మాట్లాడుతూ వేసవిశిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహించిన వివిధపోటీల్లో విజేతలుగా నిలిన వారిని శుక్రవారం బహుమతి ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

● **నందిగాం:** పత్రిక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నందిగాంశాఖా గ్రంథాలయంలోవిద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో పత్రిక పఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్రిక రోజువారీ పఠనం చేయడంతో ఎన్నో విషయాలు అవగతమవుతాయన్నారు.

110 మందికి కంటి పరీక్షలు

నరసన్నపేట: కళ్లను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా కాటరాక్ట్ సమస్య ఉండదని జిల్లా అంధత్వనివారణ సంస్థ ప్రతినిధి బాలగంగాధర్‌రాజు తెలిపారు. గురువారం నరసన్నపేటలోని బొడ్డవలస సత్యసాయి మందిరంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 110 మందికి పరీక్షలను నిర్వహించి 55 మందికి శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సత్యసాయిసేవామందిరం సభ్యులు పాల్గొన్నారు.

గౌతు శిరీషకు అభినందన


గౌతు శిరీషను అభినందిస్తున్న డాక్టర్ లీలా కోదండరావు

వజ్రపుకొత్తూరు: పలాస ఎమ్మెల్యేగా గౌతుశిరీష విజయం సాధించడంతో సాయి వినీత్ విద్యాసంస్థల అధినేతలు, వైద్యులు లీలా, కోదండరావు దంపతులు అభినందించారు. శిరీషకు శాలువ కప్పి, పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి, విద్యా సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సావిత్రి అమావాస్య పూజలు

పలాస రూరల్: మండలంలోని తర్లాకోట, పండాశాసనం, బ్రాహ్మణతర్లా, రెంటికోటల్లో గల ఒడియా బ్రాహ్మణ మహిళలు గురువారం వైశాఖ అమావాస్య పురస్కరించుకుని సావిత్రి అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పతి సౌభాగ్యం కోరుతూ జరిపే పూజల్లో ప్రధాన పూజగా సావిత్రి అమావాస్య పేరొందిన విషయం విదితమే. మామిడి, ఈత, తాటి ముంజెలు, పనసపళ్లతోపాటు పిండివంటలను నైవేద్యంగా సమర్పించి సావిత్రి కథను చదివి మహిళలు పూజలను జరిపారు. అనంతరం మహిళలు ఒకరినొకరు వాయినాలను అందజేశారు. అలాగే పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలోగల 11వ వార్డు బృందావన చంద్ర ఆలయం, రాధాకాంత ఆలయం, పెద్ద,చిన్న బ్రాహ్మణవీధుల్లో ఒడియా మహిళలు భక్తిశ్రద్ధలతో సావిత్రి అమావాస్య పూజలను నిర్వహించి సతీసావిత్రి కథను చదివి వినిపించి ఒకరినొకరు వాయినాలను అందజేశారు.

రాయితీపై విత్తనాలకు నమోదు

కొత్తూరు: మండలంలోని 27 రైతు భరోసాకేంద్రాల్లో రైతులకు రాయితీపై విత్తనాలు అందించడానికి రైతుల నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. రైతులు ఆధార్ నెంబర్‌తో రైతు భరోసాకేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించారు. ఎకరానికి బస్తాచొప్పున గరిష్ఠంగా రైతుకు నాలుగు బస్తాలు ఇవ్వ నున్నారు. మండలానికి తొమ్మిది రకాల వరి విత్తనాలు 1507 క్వింటాళ్లు కేటాయించారు. అలాగే గిరిజన గ్రామాల రైతులు కోసం 90 శాతం రాయితీపై మరో 420 క్వింటాళ్లు వరి విత్తనాలు కేటాయించారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులు రాయితీ పోను మిగిలిన ధర చెల్లిస్తే ఆంధ్రప్రదేశ్ విత్తన సంస్థ ద్వారా రెండు రోజుల్లో విత్తనాలు రైతులకు అందునున్నాయి. రైతులు నమోదు ప్ర క్రియను మండల వ్యవసాయాధికారి ఎన్. శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

రైల్వే గేట్ల వద్ద భద్రతా నియమాలు పాటించాలి

● ***లోకో ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్***


కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద భద్రతా నియమాలు వివరిస్తున్న కిరణ్‌కుమార్

పలాస: రైల్వే గేట్ల వద్ద వాహనచోదకులు భద్రతా నియమాలు పాటించి రైల్వే అధికా రులకు సహకరించాలని లోకోఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ కోరారు. గురువారం కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద రైల్వే భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వేగేట్లకు ఢీకొని రైలు పట్టాలకు ఎటువంటి నష్టం కలిగించినా రైల్వే చట్టాలు కఠినంగా అమలు చేస్తామని తెలిపారు. గేటు వేసేముందు సైరన్ మోగుతుందని, దీంతో గేటుకు దూరంలో వాహనాలు నిలిపివేయాలని కోరారు. గేటు వేసే సమయంలో ముందుగా వాహనాలువెళ్తే భారీ జరిమానా విధించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్‌మేనేజర్ ఎస్.దాస్, డీటీఐ కె.భగవతిరావు, ఆర్పీఎఫ్ ఓసీ ఎం.మహాపాత్రో, ఆర్.రమేష్, కెఎస్.కుష్వహా పాల్గొన్నారు.

మందసలో దొంగతనాలు

మందస: మందస బజారువీధిలో బుధవారంరాత్రి మూడుషాపుల్లో దొంగతనాలు జరిగాయి. స్థానిక కామేశ్వరి మందుల దుకాణం తాళాలు పగలగొట్టి నగదు, మందులు తీసుకెళ్లగా సీసీ కెమెరాలను పగలగొట్టారని షాపు యజమాని కామేశ్వరరావు తెలిపారు. పూన జయకుమార్ కిరాణాషాపులో తలుపులు పగలగొట్టి రూ.1500 నగదు తస్కరించగా, సాయిబాబాక్లాత్ షాపు షాపు తాళాలు పగలగొట్టి దొంగతానికి యత్నించారని షాపు యజమాని కోడి మోహనరావు తెలిపారు. ఈ మేరకు బాధితులు మందస పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు నిర్వహించారు.


మాస్టర్ ట్రైనర్ శేషగిరిని అభినందిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

మాస్టర్ ట్రైనర్ శేషగిరికి కలెక్టర్ అభినందన

కలెక్టరేట్: అధికారులు, సిబ్బందికి నాణ్యమైన శిక్షణ అందించి, జిల్లాలో ఎన్నికలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించిన జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ శేషగిరిని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అభినందించారు. ఎన్నికల పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు, సంతకాలతో కూడిన ప్రశంసా పత్రాన్ని గురువారం తన కార్యాలయంలో ఉపాధ్యాయుడైన శేషగిరికి అందజేశారు. విజయవాడలో శిక్షణ పొందిన ఆయన ఎన్నికల నియమాలు, విధులపై గత నాలుగు నెలలుగా అధికారులు, సిబ్బందికి వివిధ దశల్లో శిక్షణ ఇచ్చారు. ఆయనను అభినందించిన వారిలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ కూడా ఉన్నారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు శాంతియుతంగా జరిగేందుకు సహకరించిన ప్రజలకు ఎస్పీ జి.ఆర్.రాధిక గురువారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎటువంటి అ వాంఛనీయ సంఘటనలు జరగకుండా సమర్థంగా విధులు నిర్వహించిన హోం గార్డుల నుంచి డీఎస్పీ స్థాయి అధి కారులకు, అదనపు ఎస్పీలు డా.జి.ప్రేమ్ కాజల్, వి.ఉమా మహేశ్వరరావు, డి.గంగాధరం (సెబ్), కేంద్ర బలగాలు, ఎన్ఎస్ఎస్, ఎస్‌సీసీ, ఎక్స్ ఆర్మీతో పాటు ఇతర జిల్లాలకు చెందిన అదనపు బలగాలను ఎస్పీ అభినందించారు.


ఎస్పీ జిఆర్ రాధిక

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రణస్థలం: కమ్మసిగడాం జంక్షన్ సమీపంలో ఈ నెల 4న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బి.ఆదినారాయణ (29) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఆదినారాయణను డీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బంధువులు అతన్ని చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించినట్టు తెలిపారు. చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య గుణమాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేశారు.


మృతి చెందిన ఆదినారాయణ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

టెక్కలి: టెక్కలి పంచాయతీ పరిధిలోగల మండాపొలం కాలనీకి చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మెట్ట తేజేశ్వరరావు(32) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బంధువుల కథనం మేరకు.. మండాపొలం కాలనీకి చెందిన మెట్ట తేజేశ్వరరావు 192 బీఎన్ సీఆర్‌పీఎఫ్ విభాగంలో పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం తోటి సిబ్బందితో మహారాష్ట్రలో ఓ ప్రాంతంలో ఎన్నికల విధులు ముగించుకొని స్ట్రాంగ్ రూమ్‌కు సామగ్రిని అప్పగించారు.తోటి సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో వస్తుండగా, కాలకృత్యాలు తీర్చుకునేందుకు ముంబాయి-నాగపూర్ హైవేపై గాడ్చిరోలి ప్రాంతంలో దిగాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఓ ట్రక్ బలంగా ఢీకొనడంతో తేజేశ్వరరావు తీవ్రగాయాల పాలయ్యాడు. దీంతో తేజేశ్వరరావును తోటి సిబ్బంది హుటాహుటిన సమీపంలో ఓ ఆసుపత్రికి తరలించగా, మృతిచెందినట్లు ధ్రువీకరించారు. తేజేశ్వర రావుకు తల్లిదండ్రులు చిన్నారావు, తల్లి వనజాక్షి, భార్య చాందిని, నాలుగేళ్ల కుమారుడు చేతన్ ఉన్నారు. ప్రస్తుతం భార్య చాందిని గర్భిణీగా ఉన్నట్లు తెలుస్తుంది. మృతదేహాన్ని సీఆర్‌పీఎఫ్ యూనిట్ సభ్యులు శుక్రవారం టెక్కలి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. తేజేశ్వరరావు మృతితో భార్య చాందిని, తండ్రి చిన్నారావు, తల్లి వనజాక్షితో పాటు కుటుంబసభ్యులు, బంధువులు విలపిస్తున్నారు.


తేజేశ్వరరావు (ఫైల్)


సమావేశంలో మాట్లాడుతున్న పైడి కూర్మారావు

పంచసూత్రాలే ప్రగతికి ఆధారం

ఆమదాలవలస: మహిళా స్వయంశక్తి సంఘాల ప్రగతికి పంచసూత్రాలే ప్రధానమని ఆమదాలవలస ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. గురువారం వెదుర్లువలస గ్రామ సంఘం అధ్యక్షురాలు బత్తుల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి సంఘం నెలవారీ సమావేశాలు, పొదుపు, అప్పుల వసూలు, అవసరం మేరకు అప్పులు వాడుకోవడం, తిరిగి చెల్లించడం, తదితర అంశాలను పాటిస్తే సంఘాల ప్రగతికి, సభ్యుల ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు కావాల్సినంత రుణం మంజూరు చేసే వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు సుభద్ర, రామప్పడు, వీవోఏ రమ, స్వయంశక్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


స్టాక్ రిజిస్టర్లు పరిశీలిస్తున్న దృశ్యం

రశీదులు తప్పనిసరి

బూర్జ: వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రశీదులు తప్పనిసరిగా అందించాలని మండల వ్యవసాయాధికారి వి.రాజేశ్వరరావు సూచించారు. కొల్లివలస, కురింపేటలో ఉన్న విత్తన దుకాణాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు నిల్వ చేసే గోదాములు, విత్తన స్టోర్స్, స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్‌లు పరిశీలించారు. తేమ, మొలకశాతం పరీక్షల కోసం ఆమదాలవలసకు పంపించారు. కొనుగోలు చేసిన విత్తనాల నుంచి మొలక శాతాన్ని పరీక్షించుకోవాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకు వెళ్లి..

- ఎమ్మెల్యే గొండు శంకర్ కృతజ్ఞతలు

అరసవల్లి: ఎన్నికల్లో గెలిచిన తరువాత సహజంగా ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు ఆ నాయకుని వద్దకే వెళ్లి అభినందనలు, శుభాకాంక్షలు తెలియ జేయడం పరిపాటి. కానీ అందుకు భిన్నంగా తొలిసారి శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసి, ధర్మాన వంటి ఉద్దండ రాజకీయ నాయకునిపై అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా విజయం సాధించిన గొండు శంకర్ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. గురువారం ఉదయం ఆయన నగరంలోని పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో క్రీడాకారులను, ఉదయం నడకకు వచ్చే వారిని, ప్రజలను కలిసి తనను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇండోర్ స్టేడియంలో డివిజన్ ఇన్‌చార్జ్‌లు సింహాద్రినాయుడు, మల్ల అబ్బాయినాయుడు, రొక్కం భాస్కర్, రౌతు సంతోష్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, చిట్టి నాగభూషణరావు, కవ్వాడి సుశీల, రోణంకి కళ్యాణ్, సీపాన రమ, రెడ్డి సూర్యనారాయణ, తాళ్లూరి నవీన్, నంద, మణి, జగన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలే విజయానికి కారణం..

నిర్విరామ కృషి, పట్టుదలతో కృషి చేసి శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిచిన గొండు శంకర్‌కు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు గురువారం నగరంలోని విశాఖ-ఏ కాలనీలో గల ఎమ్మెల్యే కార్యాలయంలో అభినందనలు తెలియజేశారు. శంకర్ మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.


వాకర్స్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న శంకర్

రైతులకు అందుబాటులో విత్తనాలు

ఇచ్ఛాపురం: రైతులకు కావల్సిన ఐదు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి భార్గవి అన్నారు. గురువారం బిర్లంగి ఆర్‌బీకేలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ విత్తనాల కోసం రైతులు ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు అందుబాటులో ఇంద్ర, అమర, స్వర్ణ మసూరు, సాంబమసూరు, శ్రీకాకుళం సన్నాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలు అందించినట్టు తెలిపారు.


సరుబుజ్జిలి: పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందించిన దృశ్యం


ఇచ్ఛాపురం: రైతులతో మాట్లాడుతున్న ఏవో భార్గవి

పచ్చిరొట్ట విత్తనాలతో ప్రయోజనం..

సరుబుజ్జిలి: పచ్చిరొట్ట విత్తనాల వల్ల పంటలకు క్రిములు, కీటకాల బెడద లేకుండా దిగుబడులు పెరుగుతాయని వెలుగు కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ కూన రోజాలత తెలిపారు. మండలంలోని రావివలస ప్రకృతి వ్యవసాయ టీమ్ ఆధ్వర్యంలో అందించిన పచ్చిరొట్ట విత్తనాలు గురువారం రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. వ్యవసాయ పనిముట్లు, చోడి విత్తనాలు కూడా రైతులు కోరిన తక్షణమే అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎస్ఎఫ్ తిరుపతిరావు, టి.సుమ, వీవోఏ మంగమ్మ, సీసీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉపాధి పనులు

గార: గార మండలంలో ఇటీవల ఉపాధి పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. చాలా గ్రామాల్లో గత కొన్నేళ్లుగా జల వనరుల శాఖ ఎక్కడా సాగునీటి కాలువలకు కనీసం మరమ్మతులు చేపట్టని పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఉపాధి పథకం వేతనదారులు చాలా సాగునీటి చెరువులు, కాలువల్లో పూడిక, పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేస్తున్నారు. గత ఏడాది కూడా ఇలాగే ఉపాధి వేతనదారులతో చేయించిన పనుల వల్ల శివారు ప్రాంతాల్లో భూములకు కూడా సాగునీరు అందే పరిస్థితి ఏర్పడింది. ఈ ఏడాది నిన్నమొన్నటి వరకు జల వనరుల శాఖ అధికారులు కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించలేదు. తాజాగా ఈ పనులు ఊపందుకోవడంతో ఖరీఫ్‌కు సాగునీరు అందే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలోని 26 గ్రామ పంచాయితీల పరిధిలో 14.267 జాబ్‌కార్డులు మంజూరు చేశారు. ఇప్పుడు 25 గ్రామ పంచాయితీల పరిధిలో సుమారుగా 9 వేల మంది వేతనదారులు ఉపాధి పనులు చేయిస్తున్నారు. ఈ ఏడాది వేతనదారునికి కనీస వేతనం రూ.300గా ప్రభుత్వం నిర్దేశించడంతో గత ఏడాది కంటే ఎక్కువ మంది వేతనదారులు ఉపాధి పనులకు ఉత్సాహంగా వస్తున్నారని సంబంధిత సిబ్బంది చెబుతున్నారు.


వాడాడ చెరువులో ఉపాధి పనులు చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరరావు

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- డీఈవో వెంకటేశ్వరరావు

గుజరాతీపేట: సమాజ నిర్మాణంలో ప్రాథమిక ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. పెద్దపాడులో గల సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరగనున్న శిక్షణలో చిత్తశుద్ధితో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. 1, 2 తరగతుల విద్యార్థులకు మెలకువలు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి, కోర్సు డైరెక్టర్ గుంట లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జ్ఞానప్రకాష్ 60 రోజుల కార్యక్రమానికి జిల్లాలోని 30 మండలాల నుంచి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులను ఎంపిక చేశామన్నారు. వారికి గణితం, భాషకు సంబంధించిన వివిధ అంశాలలో పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు పి.దాలినాయుడు, సిహెచ్.తిరుమలరావు, అధికారులు పి.ప్రభాకరరావు, కె.నళినీకాంత్, ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి, జిల్లా కోఆర్డినేటర్ మురళీమోహన్, కేఆర్‌పీలు మోహన్, అరుణ కుమారి, శివాజీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే!

హరిపురం: మందస మండలం చీపి- బుడార్సింగి రోడ్డులో ప్రమాదకరంగా మారిన రోడ్డు కల్వర్టు ఇది. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగాఉండే రహదారిలో ఏర్పడిన గుంతతో వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రాణానికే ముప్పు ఏర్పడే పరిస్థితి నెలకొంది. ఇటీవల ఇద్దరు ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయంలో గుంతలో పడి తీవ్ర గాయాల పాలయ్యారు. కల్వర్టు మొత్తం బీటలు వారి బస్సులు, పెద్ద వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆ ప్రాంతీయులు కోరుతున్నారు.


బుడార్సింగి వద్ద ప్రమాదకరంగా మారిన కల్వర్టు

వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు

ఇచ్ఛాపురం: ఒడియా మహిళలు, ఆ సంస్కృతిని పాటించే తెలుగు మహిళలు సావిత్రి అమావాస్య పూజలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైష్ణవాలయాల్లో వడపప్పు, పానకాలను స్వామి వారికి నివేదించారు. మామిడి, పనస తదితర రకాల పండ్లను ఇంటి ఇలవేల్పుకు, విష్ణువుకు నివేదించి.. వాటిని తమ ఇంటి ఆడపడుచులకు అందించారు. పుట్టింటి నుంచి ఈ ఫలాలను తమ ఆడపిల్లలకు పంపించడం ఇక్కడ ఆనవాయితీ. స్థానిక కస్పాగౌడ వీధిలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, మంగళవారం పేటలో సావిత్రి అమావాస్య పూజలు చేశారు. ఈ సందర్భంగా 108 రకాల ప్రసాదాలను సమర్పించారు.


ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత

శ్రీ సంతోషిమాతకు పూజలు..

శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాత ఆలయంలో వైశాఖ అమావాస్య సందర్భంగా గురువారం సుప్రభాత సేవ, క్షీరాభిషేకం చేశారు. సహస్ర నామార్చన, కుంకుమ పూజలు, అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించా రు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


శ్రీకాకుళం కల్చరల్: శనీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా శనీశ్వరుని జయంతి..


శ్రీకాకుళం కల్చరల్: వైశాఖ అమావాస్య, శనీశ్వర జయంతి, పంచగ్రహ కూటమి సందర్భంగా గురువారం శ్రీఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయంలో శనీశ్వరునికి తైలాభిషేకం. ఇతర గ్రహాలకు అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


ఇచ్ఛాపురం: లక్ష్మీనరసింహస్వామికి సమర్పించిన ప్రసాదాలు

ఘనంగా భగవతమ్మ సంబరం

ఇచ్ఛాపురం: భవానీపురం గ్రామంలో వెలిసిన భగవతమ్మ అమ్మవారి సంబరాన్ని గురువారం అత్యంత వేడుక గా జరిపారు. మహిళలు అమ్మవారి ఘటాలను గ్రామంలో గల వీధుల్లో ఊరేగించి, మొక్కులు చెల్లించారు.


అమ్మవారి ఘటాలతో మహిళలు


కలిశెట్టికి స్వీట్ తినిపిస్తున్న చంద్రబాబునాయుడు

చంద్రబాబును కలిసిన కలిశెట్టి

రణస్థలం: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును విజయనగరం ఎంపీగా గెలుపొందిన కలిశెట్టి అప్పలనాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంచి మెజార్టీతో గెలిపొందిన అప్పలనాయుడును చంద్రబాబునాయుడు అభినందించారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్ ఉంటుందని చంద్రబాబు ఆయనతో చెప్పారు.

అశోక్‌కు మంత్రి పదవి రావాలని...

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించిన బెందాళం అశోక్‌కు రాష్ట్రమంత్రిగా, ఎంపీ కింజ రాపు రామ్మోహన్‌నాయుడుకు కేంద్ర మంత్రిగా పదవులు రావాలని కోరుతూ అభిమానులు, కార్యకర్తలు పూజలు చేశారు. కొళిగాంలో శ్రీ ఘగదాసుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

సీడాప్ చైర్మన్ రాజీనామా

ఇచ్ఛాపురం: వైసీపీ నాయకులు, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి తన పదవికి గురువారం రాజీనామా చేశారు. పదవి చేపట్టినప్పటి నుంచి ప్రజలకు ఎన్నో సేవలు అందించటంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించామని తెలిపారు.

కొత్త ప్రభుత్వానికి సహకరిస్తాం

గార: కొత్త ప్రభుత్వానికి ప్రభుత్వ పథకాల అమలులో పూర్తి సహకారం అందిస్తామని మండల సచివాలయ ఉద్యోగుల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమం కోసం నూతన ప్రభుత్వం కృషి చేయగలదని సంఘ అధ్యక్షుడు కనక సుందరరాణా, ఉపాధ్యక్షులు కె.భరత్, కోశాధికారి గంగు ఢిల్లేశ్వరరావులు ఆశాభావం వ్యక్తం చేశారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సోంపేట: సోంపేట ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న వారికి జూన్ 20న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

మలేరియా వ్యాధి నివారణకు చర్యలు

సరుబుజ్జిలి: మలేరియా వ్యాధి నివారణకు ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ తెలిపారు. వెన్నెలవలస గ్రామంతో పాటు సమీపంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో దోమల నివారణకు ఏసీఎం మందు స్ప్రేచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.సంతోష్‌కుమార్, సీహెచ్ డి.మోహన్‌రావు, సబ్‌యూనిట్ అధికారి ఎం.ఆచారి, ఎంఎల్ హెచ్‌పీ రుక్మిణి, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన తరువాతే కౌన్సెలింగ్

ఎచ్చెర్ల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2024-25లో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకుంటేనే కౌన్సెలింగ్‌కు అర్హులని జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2,107 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఐటీఐలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిలో ఇప్పటి వరకు 752 మంది మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్నారని చెప్పారు. మిగిలిన 1,355 మంది అభ్యర్థులు సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 10వ తేదీలోగా సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, అదే రోజు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేయాలన్నారు.

తుడ్డలిలో అన్నదానం

బూర్జ: తుడ్డలి గ్రామంలో కొలువైన షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఆలయ ధర్మకర్త కె.చౌదరినాయుడు నేతృత్వంలో అన్నదానం చేపట్టారు. కురింపేట గ్రామానికి చెందిన కొరికాన లలిత, మోహన్‌రావు, మీనాక్షి, వెంకటశివ, సీతా రామరాజు, జ్యోతిస్వరూప దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. బాబా భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

నరసన్నపేట: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. విత్తనాల నాణ్యత, నిల్వలను పరిశీలించారు. డీలర్లు అధీకృత కంపెనీల వరి విత్తనాలు మాత్రమే విక్రయించాలని ఏవో సునీత సూచించారు. గురువారం నరసన్నపేట పట్టణంలో పలు విత్తనాలు విక్రయించే ట్రేడర్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనాలను విక్రయించే ముందు డీలర్లు కచ్చితంగా నాణ్యత పరీక్షలను నిర్వహించాలని కోరారు. రైతులకు బిల్లులను ఇవ్వాలని, మొలకెత్తనట్లు రైతులు ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు ట్రేడర్స్‌లో విత్తనాలు శాంపిళ్లను సేకరించారు.

వరి విత్తనాలు సిద్ధం

హిరమండలం: ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన వరి విత్తనాలు పంపిణీకి రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని ఏవో బి.సంధ్య తెలిపారు. మండలంలోని పిండ్రువాడ గ్రామంలో ఉన్న శ్రీహరి స్వారి ఏజెన్సీ దుకాణంలో తనిఖీ చేసి విత్తనాలకు సంబంధించిన శాంపిల్స్‌ను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణీత ధరలకే విత్తనాలు,ఎరువులు విక్రయించాలని డీలర్లకు సూచించారు. మండలంలో ఎంటీయూ-1224 మారిటేరు సాంబ రకం, బీపీటీ- 5204 సాంబమసూరి, ఆర్‌జీఎల్-2537 శ్రీకాకుళం సీఆర్ రకం,ఎంటీయూ-7029 స్వర్ణరకం,ఎంటీయూ- 1061 ఇంద్రరకం, ఎంటీయూ-1064 అమర రకం, ఎంటీయూ-1121 శ్రీధృతి రకం, 1318 ఎంటీయూ రైస్, బీపీటీ 3291 సోనా మసూరి రకం అందుబాటులో ఉన్నాయని చెప్పారు.